క్లుప్తంగా

మైక్‌సెట్, నోట్‌బుక్స్ వితరణ



నెల్లూరు(టౌన్): 91 ఫౌండేషన్ సభ్యురాలు తమ్మిరెడ్డి రాధికారెడ్డి కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు సోమవారం మైక్‌సెట్, విద్యార్థులకు నో ట్‌పుస్తకాలను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి హాజరయ్యారు. హెచ్‌ఎం భాస్కరరావు, ఫౌండేషన్ స భ్యులు చంద్ర, సింహ, లక్ష్మి, రాజ్యలక్ష్మి, శ్రీలత భారతి, దేవా, శీను, భాస్కర్, కేశవ, టీచర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు



నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఆండాళ్ తాయార్‌వారి తిరువాడిప్పూర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం తిరుమంజనం, సాయంత్రం ప్రాకారోత్సవం, మాలమార్పు, రాత్రి ఊంజల్‌సేవలు విశేషంగా జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా ఆర్.రాజమన్నార్, ఉష దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

ఘనంగా భాషా వార్షికోత్సవాలు



వారోత్సవాలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ సత్యనారాయణ

ముత్తుకూరు : కృష్ణపట్నంలోని అదానీ వరల్డ్ స్కూల్‌లో భాషా వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపల్ సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్రిభాషా సూత్రంలో మాతృభాష గొప్పదన్నారు. విద్యార్థులు భాషపై పట్టు సాధించాలని, ప్రపంచంలో ఎక్కడైనా పర్యటించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు ఆంగ్ల, తెలుగు భాష పాటలకు నృత్యాలు చేసి అలరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొలగమూడి విద్యార్థినులు

వెంకటాచలం : శ్రీకాకుళంలో ఈనెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని గొలగమూడిలో ఉన్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్‌ఎం బి.లక్ష్మీకామేశ్వరి దేవి, పీడీ షేక్.షబిక సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థినులు టి.నాగలక్ష్మి వరప్రసన్న, ఆర్.శ్రీలత జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలియజేశారు.

స్టడీ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

• ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియెట్ స్టడీ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ కోరారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ ఆవశ్యకతపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో చదువు మానేసిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ మంచి అవకాశమన్నారు. 15 ఏళ్ల వయస్సు దాటిన ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. చదవడం, రాయడం వచ్చిన వారు ఎలాంటి విద్యార్హత లేకుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎన్.అంకయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్యా విధానం) వారు స్టడీ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో చేరిన వారికి ప్రత్యేకంగా తరగతులు కూడా నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నార్తురాజుపాళెం హైస్కూల్ హెచ్‌ఎం డి.ఓబులేసు, వెలుగు ఏపీఎం ఎస్.రుక్మిణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ వి.మనోజ్‌కుమార్‌రెడ్డి, సీఆర్‌ఎంటీలు జె.పెంచలరావు, ఎం.దయాకర్, పులి రమేష్, సీహెచ్ శ్రీహరిబాబు, తోట వెంకట సురేష్, గూడూరు విజయమ్మ, మస్తాన్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం కల్పించాలి. రసం, సాంబార్ నీళ్లగా ఉంటుందనే విమర్శలు ఉన్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి.

– ఎం.వెంకటేశ్వర్లు, సౌత్‌మోపూరు

టీచర్ల కొరత లేకుండా చూడాలి



విద్యార్థులకు మంచి విద్యను అందించాలంటే టీచర్లను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలి. అందులో భాగంగా టీచర్ల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పాముజుల హరి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

గుడ్డు సైజు తగ్గిపోయింది



మధ్యాహ్న భోజనంలో అందించే గుడ్డు సైజును తగ్గించారు. దీంతో విద్యార్థుల ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది. అధికారులు మధ్యాహ్న భోజన వడ్డింపును నిత్యం పరిశీలించాలి.

– ఈ.లక్ష్మి, జనార్దన్‌రెడ్డికాలనీ

పూర్తిస్థాయిలో కిట్ల పంపిణీ జరగలేదు



విద్యాకానుక కట్లను పాఠశాలల్లోని విద్యార్థులందరికీ పంపిణీ చేయలేదు. దీంతో కొందరు విద్యార్థులు కిట్లు అందక ఇబ్బంది పడుతున్నారు. యూనీఫాంలు కూడా వేసుకోకుండా పాఠశాలలకు వెళ్తున్నారు.

– పి.సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరపురం

యూనిఫాంలను అందించండి



విద్యార్థులకు యూనిఫాంలను అందించండి. గత ప్రభుత్వంలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫాం, షూస్ ఇలా విద్యాకానుకను ఇచ్చేవారు.

– యు.పద్మ, బుజబుజనెల్లూరు

విద్యపై పచ్చనీడలు

కొత్తగా చేరిన విద్యార్థులకు అందని విద్యా కిట్లు.. మధ్యాహ భోజనంలో నాణ్యత కొరత.. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఉపాధ్యాయులను నియమించకపోవడం.. ఇదీ గత రెండు నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం సాధించిన ఘనత. దీనివల్ల గత విద్యా సంవత్సరంతో పోల్చి చూస్తే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది.

సర్కార్ పాఠశాలలపై కొరవడిన నమ్మకం
- విద్యాకానుక కిట్ల పంపిణీలో కొరత
- మధ్యాహ్న భోజనంలో నాణ్యతా లోపం

నెల్లూరు అర్బన్, రూరల్‌లో టీచర్ల కొరత	గతేడాది కంటే తగ్గిన విద్యార్థులు
107 మంది	1,011 మంది



దీనదయాళ్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉండడంతో ఇతర తరగతుల విద్యార్థులను ఒకే గదిలో బోధిస్తున్న వైనం



చిన్న బాలయ్యనగర్‌లోని మున్సిపల్ స్కూల్లో ఇంటి నుంచి తెచ్చుకున్న తింటున్న విద్యార్థులు

నెల్లూరు సిటీ/ నెల్లూరు(బారకాసు)/ నెల్లూరు (వీఆర్సీ సెంటర్) : నేటి బాలలే.. రేపటి పౌరులంటారు.. కానీ తెలుగుదేశం ప్రభుత్వం విద్యార్థుల పట్ల చులకన భావంతో వ్యవహరిస్తోంది. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం, విద్యాకానుక కిట్ల కొరత, టీచర్ల కొరతతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. క్రమేనా పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయే ప్రమాదం ఏర్పడుతోంది. ఇందుకు ప్రధాన కారణం ప్రైవేటు పాఠశాలలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు టీడీపీలోని బడా నాయకులు చక్రం తిప్పుతున్నట్లు స్పష్టమవుతోంది.

నెల్లూరు అర్బన్, రూరల్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 54 డివిజన్‌లు, 18 పంచాయతీలు ఉన్నాయి. మొత్తం పాఠశాలలు 194 ఉన్నాయి. విద్యార్థులు 28,733 మంది చదువుతున్నారు. ఉపాధ్యాయులు 1,133 మంది ఉన్నారు. అర్బన్ ప్రాంతంలోని 28 డివిజన్‌లలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద ఇస్కాన్ ట్రస్ట్ వారు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 26 డివిజన్‌లు, 18 పంచాయతీల్లో ఏజెన్సీలకు భోజన ఏర్పాట్లను కేటాయించారు.

టీచర్ల కొరత

అర్బన్ నియోజకవర్గంలో 434 టీచర్లు ఉండాల్సి ఉండగా 369 మంది ఉన్నారు. రూరల్ నియోజకవర్గంలో 806 మంది టీచర్లు ఉండాల్సి ఉంది. అయితే కేవలం 764 మంది ఉన్నారు. పలు పాఠశాలల్లో టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. దీంతో విద్యార్థులకు మంచి విద్యను సైతం అందించలేని పరిస్థితి ఏర్పడింది.

గుడ్డు చిన్నదైంది

విద్యార్థులకు పౌష్టికాహారంలో అతి ముఖ్యమైంది కోడిగుడ్డు. అయితే మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు చిన్నసైజు కోడిగుడ్డును వడ్డిస్తున్నారు. అదే విధంగా నీళ్ల కూరలు, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా భోజనం పెడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కిట్ల కొరత

విద్యాకానుక కింద బ్యాగ్, పుస్తకాలు, షూ, యూనిఫాంలను అందించాల్సి ఉంది. అయితే పాఠశాలల్లోని విద్యార్థులందరికీ కిట్ల పంపిణీ జరగలేదు. పదుల సంఖ్యలో విద్యార్థులకు కిట్లు అందలేదు. దీనిపై ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్లను వివరణ కోరగా చాలా మంది విద్యార్థులకు కిట్లు ఇంకా రాలేదని తెలిపారు.

గణనీయంగా తగ్గుముఖం

గత నాలుగేళ్లగా విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యాకానుక, అమ్మఒడి ఇలా అన్నివిధాల మౌలిక సదుపాయాలు అందించారు. అయితే టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదే విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టడం ఆందోళనకు గురిచేస్తోంది. గతేడాది నెల్లూరు అర్బన్, రూరల్ నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల్లో 29,744 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది 28,733 మంది చదవుకుంటున్నారు.

నెల్లూరు అర్బన్ పరిధిలో..	
మొత్తం పాఠశాలలు	53
హైస్కూల్స్	15
అప్పర్ ప్రైమరీ స్కూల్స్	04
ప్రైమరీ స్కూల్స్	34
మొత్తం విద్యార్థులు	11,334
టీచర్లు ఉండాల్సింది	434
ఉన్నది	369
కొరత	65

నెల్లూరు రూరల్ పరిధిలో..	
మొత్తం పాఠశాలలు	141
హైస్కూల్స్	24
అప్పర్ ప్రైమరీ స్కూల్స్	10
ప్రైమరీ స్కూల్స్	107
విద్యార్థులు	17,399
టీచర్లు ఉండాల్సింది	806
ఉన్నవి	764
కొరత	42



నవాబుపేటలోని పాఠశాలలో ఇంటి నుంచి భోజనం తెచ్చి కుమార్తెకు తినిపిస్తున్న తల్లి

తల్లికి వందనం కోసం ఎదురు చూస్తున్నాం



మా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా అమ్మఒడి కింద రూ.15 వేలు ఇస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని ఇంకా అమలు చేయలేదు. ఎప్పుడిస్తారా అని ఎదురు చూస్తున్నాం.

– లక్ష్మి, రామచంద్రాపురం.

ఆరోగ్యం బాగుండటం లేదు



ఇక్కడి స్కూల్లో మధ్యాహ్నం భోజనం తింటే మా పిల్లలకు ఆరోగ్యం బాగుండటం లేదు. అందువల్ల రోజూ ఇంటి నుంచే భోజనాన్ని తీసుకెళ్లి ఇస్తున్నా. తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని ఇంత వరకు ఇవ్వకపోతే ఎలా? ఎన్నికల సమయంలో చెప్పినట్లుగా చేస్తే బాగుంటుంది.

– సుకన్య, నవాబుపేట

పేద విద్యార్థులపై నిర్లక్ష్యం



పేద విద్యార్థులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. స్కూల్స్ తెరిచి రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో కొందరికి యూనిఫాం ఇవ్వకపోవడం దారుణం. చాలా స్కూల్స్‌లో టీచర్ల కొరత ఉన్నా.. కనీసం చర్యలు తీసుకోవడం లేదు. అంతే కాకుండా మధ్యాహ్న భోజనంలో నాణ్యత ఉండడం లేదు. పైగా దుర్వాసన వస్తోంది. దీనిని తింటే విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు.

– కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి, సీపీఎం

పిల్లలకు నాణ్యమైన భోజనం అందివ్వాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలె నాణ్యమైన భోజనం అందించాలి. చిక్కీలు, పాలు, గుడ్లు, అరటి పండ్లు లాంటి పౌష్టికాహారం ఇవ్వాలి. విద్యావ్యవస్థలో పటిష్ట మార్పులు కొనసాగించాలి. విద్యార్థులకు అందాల్సిన యూనిఫాం, డిక్షనరీలను వెంటనే ఇవ్వాలి.

– షేక్ గుల్జార్, 53వ డివిజన్

ఉర్దూ టీచర్ లేరు



వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉర్దూ టీచర్ లేరు. దీంతో ఉర్దూ భాష తీసుకున్న 250 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులకు కూడా తగినంత మంది ఉపాధ్యాయులు లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉర్దూ టీచర్‌తో పాటు, ఇతర సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించాలి.

– ఎస్‌కె హుస్సేన్, విద్యార్థి తండ్రి, వెంకటేశ్వరపురం

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



అర్బన్ తహసీల్దార్ షఫీమాలిక్‌కు మొక్కను అందిస్తున్న డీటీ బషీర్

నెల్లూరు సిటీ : తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా నెల్లూరు అర్బన్‌కు షేక్ షఫీమాలిక్, రూరల్‌కు డి.లాజరస్ నియమితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీరు సోమవారం వారి కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా నెల్లూరు ఆర్డీ కార్యాలయ డీఏఓగా జి.రాఘవేంద్రరావు బాధ్యతలు స్వీకరించారు. వీరికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



వారోత్సవాల్లో పాల్గొన్న డాక్టర్లు, గర్భిణులు తదితరులు

నెల్లూరు(అర్బన్): పుట్టిన బిడ్డకు తల్లిపాలతోనే ఆరోగ్యం కలుగుతుందని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వసుంధరాదేవి, సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి) సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం నెల్లూరు పెద్దాస్పత్రిలోని తల్లీబిడ్డల విభాగం బ్లాక్‌లో గర్భిణులు, బాలింతలకు గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వసుంధరాదేవి, సిద్దానాయక్ మాట్లాడుతూ పుట్టిన అరగంటలోపు బిడ్డకు పట్టించే ముర్రుపాలు వ్యాధినిరోధకత శక్తిని పెంచుతాయన్నారు. వైద్య విద్యార్థులు ప్రదర్శించిన తల్లిపాలు.. ఆరోగ్యం అనే నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ గీతాలక్ష్మి, చిన్నపిల్లల డాక్టర్ సురేష్, డాక్టర్ మస్తాన్‌బాషా, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ కళారాణి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన శాంతిభద్రతలను అందిస్తా

• చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): స్టేషన్ పరిధిలో నేరాలను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందిస్తానని నగరంలోని చిన్నబజారు పోలీసుస్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తెలిపారు. ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న బి.అశోక్‌కుమార్ రేంజ్ కార్యాలయానికి బదిలీకాగా ఆయన స్థానంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావును నియమించిన విషయం తెలిసిందే. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎస్సైలు సైదులు, లతీపున్నీసా, సిబ్బంది తదితరులు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. అసాంఘిక కార్యకలాపాల ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించబోమని కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నేర నియంత్రణకు తీసుకునే చర్యలకు ప్రజలు తసహకరామందించాలని కోరారు. అనంతరం ఆయన ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ప్రసాద్, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

1996 బ్యాచ్ ఆర్ఎస్ఐ

ఒంగోలు పట్టణానికి చెందిన కోటేశ్వరరావు 1996లో పోలీసుశాఖలో ఆర్ఎస్ఐగా బాధ్యతల్లో చేరారు. 2007లో సివిల్ కాన్వెర్షన్ పొందారు. గుంటూరు జిల్లాలో ఎస్ఐగా వివిధ పోలీసుస్టేషన్లలో పనిచేశారు. సీఐగా పదోన్నతి పొంది మంగళగిరి, పట్టాభిపురం, బాపట్ల, నెల్లూరు సంతపేట, బుచ్చిరెడ్డిపాళెం, డీటీసీ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు.

సుప్రీంతీర్పును వ్యతిరేకిస్తున్నాం

నెల్లూరు (బారకాసు): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు సరికాదని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నామని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణా వెంకయ్య అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాల మహానాడుకు చెందిన పలువురు నాయకులతో కలసి ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ఎస్సీలకు, దళితులకు చీకటి రోజన్నారు. ఈ సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర ఉద్యోగ సంఘాల ప్రధాన కార్యదర్శి కట్టేటి మోహన్‌కృష్ణ, జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య, జిల్లా యువత అధ్యక్షుడు బల్లి శరత్‌కుమార్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి హర్ ఘర్ తిరంగా

నెల్లూరు(దర్గామిట్ట) : ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 13వ తేదీ వరకు జిల్లాలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 6న ఎగ్జిబిషన్, 7న ర్యాలీలు, 8న డ్రాయింగ్, పెయింటింగ్, చర్చా వేదికలు, జింగిల్స్ రూపొందించడంపై పోటీలు, 9న సాంస్కృతిక కార్యక్రమాలు, 10న స్వాతంత్ర్య సమరయోధుడు వీవీ గిరి జయంతి నిర్వహణ, సాయంకాలపు హారతులు, 11న వారసత్వ నడకలు, 12న క్రీడాపోటీలు, 13న జాతీయ పతాకంతో సెల్ఫీలు దిగుట మొదలైన దేశ సమగ్రత, జాతీయ భావం పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

విద్యుత్ భవన్‌లో స్పోర్ట్స్ గది ఏర్పాటు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ప్రధాన పరిపాలనా కార్యాలయం విద్యుత్ భవన్‌లో సోమవారం స్పోర్ట్స్ గదిని జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్, నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ ప్రారంభించారు. ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్‌శాఖ క్రీడాకారుల కోసం నూతనంగా స్పోర్ట్స్ గదిని ఏర్పాటు చేశామన్నారు. రూరల్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, స్పోర్ట్స్ సెక్రటరీ వేలు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల అందజేత



విద్యార్థినికి పురస్కారం ఇస్తున్న దృశ్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ నెల్లూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. 2023–24 విద్యాసంత్సరాల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ తదితర కోర్సుల్లో 90 శాతానికిపైగా మార్కులు సాధించిన 14 మందికి రూ.92,500 నగదు, ప్రశంసాపత్రాలు, బహుమతులను ఇచ్చారు. కొందరికి లక్ష్మీపురంలోని రత్నం హైస్కూల్లో, మరికొందరికి స్టోన్‌హౌస్‌పేటలోని బ్యాంక్ కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ టీఆర్‌కేవీ శర్మ, రత్నం హైస్కూల్ ప్రిన్సిపల్ రామకృష్ణ, వీసీబీ జోనల్ మేనేజర్ వెంకటేష్, కమిటీ సభ్యులు ప్రసాద్, పద్మావతి, వెంకటేశ్వర్లు, మస్తాన్ పాల్గొన్నారు.

నెల్లూరు క్లబ్ ఎన్నికల్లో తప్పని పోటీ

- నామినేషన్ వేసిన వారిలో ఒకరు విత్‌డ్రా
- ఓటు హక్కు ఇవ్వలేదని కొందరు కోర్టుకు వెళ్లిన వైనం
- కోర్టు నుంచి తీర్పు వెలువడే దాని బట్టి ఎన్నికలు

నెల్లూరు (బారకాసు): ప్రతిష్టాత్మకమైన నెల్లూరు క్లబ్‌కు సంబంధించి పాలకవర్గ ఎన్నికల్లో రెండు ప్యానల్స్ పోటీ పడుతున్నాయి. పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ఇసనాక సునీల్‌రెడ్డి ప్యానల్స్ పోటీ పడడంతో ఎన్నికలు నిర్వహణ తప్పని పరిస్థితి అయింది. ఈ రెండు ప్యానల్స్ నుంచి నామినేషన్లకు ఆదివారం ఎన్నికల అధికారి ఆమోదం తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియలో పాలకవర్గ ఈసీ మెంబర్‌గా 10 మంది నామినేషన్లు దాఖలు చేయగా కర్నాటి బ్రహ్మారెడ్డి పోటీ నుంచి తప్పుకుంటూ విత్ డ్రా చేసుకున్నారు. మిగిలిన అభ్యర్థులందరూ పోటీకి తలపడనున్నారు. ఈ నేపథ్యంలో కొంత మంది తమకు ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించలేదని కోర్టుకు వెళ్లారు. అభ్యర్థుల దరఖాస్తును పరిశీలించిన కోర్టు మంగళవారం తీర్పు ఇవ్వనుంది. తీర్పు ఆధారంగా ఎన్నికలు జరుగుతాయి. ఒక వేళ కోర్టు ఎన్నికలు జరుపుకోండని ఆదేశిస్తే పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్యానల్ గెలుపొందే అవకాశాలు అధికంగా ఉన్నాయంటూ నెల్లూరు క్లబ్ సభ్యుల్లో చర్చ జోరుగా సాగుతోందని సమాచారం.

అర్జీలను వేగంగా పరిష్కరించాలి

• అదనపు కమిషనర్ శర్మద



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ శర్మద

నెల్లూరు(బారకాసు) : సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించాలని అదనపు కమిషనర్ శర్మద అన్నారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆమె సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనధికార కట్టడాలు, కాలువల పూడికలు, ఆస్తి పన్నులకు సంబంధించిన అంశాలపై ఫిర్యాదులు వచ్చాయని, వాటిని నిర్ణీత గడువులోపు పరిష్కారాలని ఆదేశించారు.

21 ఫిర్యాదులు

ప్రజా సమస్యలపై మొత్తం 21 ఫిర్యాదులు స్వీకరించా మని శర్మద తెలిపారు. ఇందులో ఇంజినీరింగ్–5, టౌ న్‌ప్లానింగ్–12, పబ్లిక్ హెల్త్–3, ఎస్టాబ్లిష్‌మెంట్‌కు స ంబంధించి ఒక ఫిర్యాదు వచ్చిందన్నారు. ఎస్ఈ సంపత్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్యరెడ్డి, సిటీ ప్లా నర్ దేవీకుమారి, మేనేజర్ ఇనాయతుల్లా, టీపీఆర్ఓ ప్రసాద్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.